


మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా సౌభాగ్యలక్ష్మి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జిజిహెచ్ బోధనాసుపత్రికి పూర్తి స్థాయి ప్రిన్సిపల్‌గా డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2023-24 విద్యా సంవత్సరం నుంచి 150 మెడికల్ సీట్లు అందుబాటులో రావడంతో అందుకు అనుగుణంగా తదుపరి కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. 2023 ఆగస్ట్ నుంచి తొలిబ్యాచ్ ప్రారంభమవుతుందన్నారు. అందుకను గుణంగా మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, ప్రయోగశాల, హాస్టల్, బోధకులు, వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర స్టాఫ్‌తో సమావేశం నిర్వహించి ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారికి నివేదిక అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.రమేష్, వైద్యులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.


అన్నదాతలపై సాగు భారం

- ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు
- విత్తడానికి ముందే రైతుల్లో దిగులు
- దక్కని మద్దతు ధరతో అగచాట్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చుతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. ట్రాక్టర్లు, యంత్రాల అద్దెలు ప్రతి ఏటా పెరగడంతో పెట్టుబడులు పెరిగి వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది. గత రబీ పంటకు ప్రస్తుత ఖరీఫ్‌కు ఎకరాకు రూ.5వేలకు పైగా ధరలు పెరిగినట్లు రాజమహేంద్రవర రూరల్‌కు చెందిన ఓ రైతు వివరించారు. ఒకప్పుడు పల్లెల్లో ఇళ్ల ఎదుట కాడెద్దులు, పశువులు, వ్యవసాయ సామగ్రి కనిపించేవి. కాలక్రమేణా ఎడ్ల పోషణ భారంగా మారడంతో సేద్యపు ఎడ్లు, పనిముట్ల స్థానాన్ని ట్రాక్టర్లు, యంత్రాలు ఆక్రమించాయి. దుక్కి దున్నడం మొదలు పంట కోత వరకు, మందుల పిచికారీ కోసం కూడా యంత్రాలపైనే ఆధారపడక తప్పడం లేదు. నిత్యం పెరుగుతున్న డీజిల్ ధరలు ఇప్పుడు రైతులకు అదనపు భారంగా మారుతున్నాయి. రైతులు పాత పద్ధతుల్లో సాగు చేయలేక కొత్త పద్ధతులు అందుకోలేక సతమతమవుతున్నారు. చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రతి ఏటా ఖర్చులు పెరగడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుంచి ముందస్తు సాగుకు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. వరతలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి కొంత ఊరట లభించే అవకాశం ఉంటుందని అధికార యంత్రాంగం చెబుతున్నారు. అయితే ఆచరణలో భిన్నమైన ఫలితాలు ఉండటతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. సాధారణంగా ఏరువాక పౌర్ణమి నుంచి రైతులు వడివడిగా సాగు ప్రారంభిస్తారు. అధికారుల గణాంకాల ప్రకారం నూతనంగా ఏర్పడిన తూర్పుగోదావరి జిల్లాలో 1.56 లక్షల ఎకరాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు జరుగుతుందని అంచనా. ఎకరా సాగుకు



అక్షరాలా రూ.30 వేలకుపైగా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరా సాగుకు నాలుగు సార్లు దుక్కులకు రూ.4,600, విత్తనాలు, నార్లు, దశల వారీ కూలీల ఖర్చులు మరో రూ.7వేలు ఖర్చవుతోంది. కోత ఖర్చులు రూ.8,800, ఎరువులకు రూ.6,200, తొలి దశలో ఎరువులు, పురుగుల మందులకు రూ.3,600 ఖర్చు అవుతుంది. కౌలు రైతులకు భూమి కౌలు అదనంగా మారుతోంది. మొత్తం సాగు ఖర్చుల్లో 60 శాతానికిపైగా యంత్ర వినియోగానికి, రసాయనిక ఎరువులు, పురుగుల మందులకు ఖర్చు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వాలు ఒకవైపు యాంత్రీకరణ వైపు దృష్టి సారించాలని సూచిస్తుండగా రోజురోజుకీ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతుల నడ్డి విరుస్తున్నాయి. దీంతో రైతులు సాగు విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. నేల తల్లిని నమ్ముకున్న అన్నదాతలు ఏటా వ్యవసాయంలో నష్టాలే చవిచూస్తున్నారు. దుక్కులు దున్నడం మొదలుకుని పంటలు చేతికి వచ్చేంత వరకు యంత్రాలతోనే పనులు చేయించే రైతులకు పెట్టుబడి భారంగా మారుతుంది.

ఊరటనివ్వని ప్రభుత్వం పథకాలు

ప్రభుత్వ పథకాలు తమకు ఊరట కల్పించడటంలేదని రైతులు వాపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాదికోసారి పిఎంకిసాన్, రైతు భరోసా పేరుతో రూ.13,500 మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితగా పెట్రోల్, డీజిల్ ధరలు చుక్కలనంటుతున్నాయి. లీటరు పెట్రోల్ రూ.111కి చేరింది. డీజిల్ ధర రూ.99 దాటిపోయింది. రైతులపై అదనపు భారంట్రాక్టర్‌తో దుక్కి దున్నించడానికి పనిని బట్టి గంటకు అద్దె తీసుకుంటున్నారు. కల్టీవేటర్‌కు, డిస్కులతో దున్నితే, రోటోవేటర్, ఫ్లవ్ వేసేందుకు చార్జీలు పెరిగిపోయాయి. ఒక ఎకరానికి సాగు చేసేందుకు రైతుకు కేవలం టాక్టర్ దున్నడానికి అదనంగా రెండు వేలకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎకరం భూమి దున్ని సాగు చేసేందుకు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. నిత్యం డీజిల్ ధరలు పెరగడంతో టాక్టర్ల చార్జీలు పెరిగాయని రైతులు వాపోతున్నారు. గడిచిన వానాకాలం, రబీతో పోలిస్తే ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడి ఖర్చు పెరిగింది. సొంత భూమి కలిగిన రైతుకు ఎకరా వరి సాగుకు రూ.30వేలు పెట్టుబడి ఖర్చు కాగా కౌలు రైతులకు మరో రూ.10వేలు అదనపు ఖర్చు పెరుగుతోంది. ఆరుగాలం కష్టం చేసినా ఆదాయం రాకపోగా నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవదేన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఏటా ఖర్చులు పెరుగుతున్నాయి

డీజిల్ ధరలతో పాటు ఎరువుల ధరలూ ప్రతి ఏటా పెరుగుతున్నాయి. ఆ స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయం ప్రతి ఏటా సంక్షోభంలోకి వెళ్లిపోతోంది. ప్రస్తుతం పెరిగిన ధరల కారణంగా ట్రాక్టర్‌తో 3 ఎకరాలు దున్నటానికి పదివేలకుపైగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను నామమాత్రంగా పెంచింది. కానీ మిగతా అన్నిటికీ విపరీతమైన ఖర్చులవుతున్నాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతులకు భరోసా కల్గించేలా సాయం అందించాలి.

-కె. వెంకటేశ్వరరావు వరి రైతు కోరుకొండ



పర్స సత్యనారాయణకు నివాళులర్పిస్తున్న బేబిరాణి తదితరులు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు బేబిరాణి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి పిలుపునిచ్చారు. కార్మిక నేత పర్స సత్యనారాయణ జయంతిని శ్యామలా సెంటర్‌లోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి బేబిరాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. 1970లో సిఐటియు ఏర్పడిందన్నారు. సత్యనారాయణ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నో కార్మిక సంఘాలను స్థాపించి కార్మికుల హక్కులు, వేతనాలు, సౌకర్యాల కోసం పోరాడారన్నారు. గనీ కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. కార్మికలోకం పత్రిక ద్వారా ఎన్నో వ్యాసాలు రాసి కార్మికులను చైతన్యవంతం చేశారన్నారు. అయన పోరాట స్ఫూర్తితో నేడు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికవర్గం ఐక్యంగా ఎదుర్కోనాలన్నారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు కార్మికలను బానిసలుగా చేసి వారి రక్త మాంసాలు పీల్చుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మోదీకి బి టీమ్‌గా మారిందన్నారు. కార్మికులు, ఉద్యగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కటికూడా నెరవేర్చలేదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోదీ, జగన్ ప్రభుత్వాలను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.బేబిరాణి, రాజమండ్రి ప్రాజెక్టు కార్యదర్శి సునీత, సిపిఎం రాజమండ్రి నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - గోపాలపురం

హామీలు అమలు చేయాలని, డిమండ్లను నెరవేర్చాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఒక రోజు రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్‌రాజు మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను గాలికి వదిలేసి, ఎన్నడూ చూడని విధంగా ఐఆర్ కంటే తక్కువ ఫిట్మెంట్ ఇచ్చిన ప్రభుత్వంగా వైసిపి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రభుత్వ ఉద్యోగుల ఆశలను నీరుగార్చారన్నారు. తమకు రావాల్సిన డిఎలు, ఎరియర్స్‌ను అడుగుతుంటే కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఒకటో తేదీన జీతాలు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెరుగైన జీతాలు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు రిటైర్మెంట్ రోజున అన్ని ఆర్థిక ప్రయోజనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణ, ఎంఎస్ఎస్.కుమారి, సుందరి, కృష్ణ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో కూర్చొన్న ప్రభుత్వ ఉద్యోగులు

వడదెబ్బకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నల్లజర్ల



తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో వడదెబ్బకు పుట్ట నాగరాజ్(32) మృతి చెందాడు. నాగరాజు వత్తిరీత్యా ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం యథావిధిగా పనికి వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఇటుకను ఆన్‌లోడ్ చేస్తుండగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు సపర్యలు చేశారు. అప్పటికే ఆయన మృతి చెందాడు.

నేటితో బదిలీల దరఖాస్తుకు గడువు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

గ్రామ సచివాలయ, వార్డ్ సచివాలయ ఉద్యోగుల బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేం దుకు శనివారంతో గడువు ముగియనుంది. ఈ మేరకు కలెక్టర్ కె.మాధవీలత శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూన్ 10 లోగా మొత్తం బదలీ ప్రక్రియ పూర్తి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, తీవ్ర అనారోగ్య సమస్యలకు సంబంధించి ఉద్యోగుల విషయంలో వ్యక్తిగత, జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లి తండ్రుల వైద్య సేవలు అందించే క్రమంలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. 2019, 2020లో జారీ చేసిన నోటిఫికేషన్ కింద నియామకం పొందిన సచివాలయ ఉద్యోగులు అర్హులు అని స్పష్టం చేశారు. 2023 ఏప్రిల్ 30 నాటికి కనీసం రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని పిట్టల వేమవరం పరిధిలో రైతులకు నవధాన్యాలు, పచ్చిరొట్ట విత్తనాలను శుక్రవారం అందించారు. ఎస్‌సి సామాజికవర్గ రైతులకు జీవన ఎరువులు, ధాన్యాలు ప్రాముఖ్యతను తెలియజేశారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎగ్జిక్యూటివ్ అధికారి రామకృష్ణ హాజరై ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అందరూ దీనిపై అవగాహన కలిగి సాగు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటరావు, విద్యాలత, రైతులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి సిఎం జగన్

హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్ రామ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



ట్రాక్టర్ నడుపుతున్న హోం మంత్రి వనిత, చిత్రంలో ఎంపీ భరత్

ముఖ్యమంత్రి జగన్ రైతుల పక్షపాతి అని హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం లాలా చెరువు ప్రాంతంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన 'వైఎస్ఆర్ యంత్ర సేవా పథకం' మెగా మేళా-2.0 కార్యక్రమంలో హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్ రామ్, జెసి తేజ్ భరత్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత సభ వేదిక సమీపంలో వున్న వైఎస్ఆర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. హోం మంత్రి వనిత మాట్లాడుతూ గత పాలకుల హయాంలో వ్యవసాయాన్ని దండగ అంటే, జగనన్న ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగగా చేసిందన్నారు. ముందస్తుగా సాగు ద్వారా విపత్తుల నుంచి పంటలను రక్షించుకునే వెసులుబాటు కలిగిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎంపీ మార్గని భరత్‌రామ్ మాట్లాడుతూ జిల్లాలో 166 సిహెచ్‌సి గ్రూపులకు రూ.5.96 కోట్లు విలువజేసే 103 ట్రాక్టర్లు, 15 హార్స్ పవర్స్ గల 15 వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తున్నారనా్ౖర.కొందరు అమలుకు నోచుకోని శుష్క వాగ్దానాలు ఇస్తున్నారన్నారు. గతంలో కూడా ఎన్నో హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయని విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. జగన్ అమలు చేస్తున్న పథకాలను కొంత మంది కాపీ చేస్తున్నారన్నారు. జగన్ హయాంలో రైతులు, ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యుడు తేజా, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, స్థానిక నేతలు పాలిక శ్రీను, గిరజాల బాబు తదితరులు పాల్గొన్నారు.

కడియం : వైఎస్ఆర్ యంత్రసేవా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ కె.ద్వారకాదేవి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ యాలి గోపాలం కోరారు. శుక్రవారం నిర్వహించిన వైఎస్ఆర్ యంత్రసేవా పథకం మెగా మేళా - 2లో కడియం మండలానికి రూ.36 లక్షల విలువైన 4 ట్రాక్టర్లను రూ.14 లక్షల సబ్సిడీతో మంజూరు చేశారన్నారు. కడియం గ్రామానికి చెందిన మూడు సిహెచ్‌సి గ్రూపులకు, కడియపుసావరం గ్రామానికి చెందిన ఒక గ్రూపునకు వీటిని అందించామన్నారు. ఆయా గ్రూపుల వారు రైతులకు అందుబాటులో ఉంటూ యంత్రసేవలు అందించాలని కోరారు.

'ద్రోణ'లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి -గోకవరం

మండల కేంద్రమైన గోకవరం గ్రామంలో ద్రోణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో ద్రోణా పబ్లిక్ స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది పదోతరగతిలో 575 మార్కులు సాధించిన ద్రోణా పబ్లిక్ స్కూల్ విద్యార్థిని జె.ప్రవల్లికకుమారి ఎంఎల్ఎ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండలం సచివాలయం కన్వీనర్ దాసరి రమేష్, వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, గోకవరం సొసైటీ మాజీ అధ్యక్షులు దాసరి తమన్నదొర, కామరాజుపేట సొసైటీ అధ్యక్షులు పిడిం సతీష్‌కుమార్, వైసిపి పట్టణ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు కె.శివరామకష్ణ, గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ డైరెక్టర్ పి.సత్యానందం పాల్గొన్నారు.

జనావాసాల చెంత బల్క్ పరిశ్రమ వద్దు

ప్రజాశక్తి - గోపాలపురం

సగ్గొండను ఆనుకుని నిర్మిస్తున్న సిఎస్‌డి బల్క్ పరిశ్రమ వద్దంటూ సిపిఐ నాయకులు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానిక కమ్యూనిటీ గ్రౌండ్‌లో ఫ్యాక్టరీ నిర్మాణం అడ్డుకుంటామని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడారు. ఇప్పటికే గ్రామస్తులు ఈ పరిశ్రమ వద్దంటూ అధికారులకు విన్నవించారన్నారు. అయినా పాలకుల్లో చలనం లేదన్నారు. ఈ పరిశ్రమ వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. సోమవారం జరిగే గ్రామసభలో విద్యావంతులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు హాజరై ఫ్యాక్టరీని వద్దంటూ తీర్మానించాలని పిలుపునిచ్చారు. అనంతరం తహశీల్దార్ బి.రవీంద్రనాథ్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.రాంబాబు, వి.కొండలరావు, ఎ.సత్యనారాయణ, సిహెచ్.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కామలలో ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని సర్పంచ్ కేతా త్రిమూర్తులు తెలిపారు. శుక్రవారం కొండాలమ్మ గుడి ప్రాంతంలో పిల్ల కాలువ పూడికతీత తీస్తున్న సుమారు 100 మంది ఉపాధి కూలీలకు ముక్కామల సబ్‌సెంటర్ మెడికల్ సిబ్బంది ఆధ్వర్యంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. సుమారు 80 మంది కూలీలకు టిటి ఇంజక్షన్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ దొంగ సత్యనారాయణ, వైద్యులు వెంకటపతి, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డుపై మట్టి తొలగించాలి

ప్రజాశక్తి- కడియం

గోదావరి తాగునీరు పైప్‌లైన్ మరమ్మతుల నిమిత్తం తవ్విన గోతిని వెంటనే పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. కడియం నుంచి వీరవరం వెళ్లే ప్రధాన రహదారిలో విక్టరీ బజార్ ఎదురుగా గోదావరి పైప్ లైన్ పాడై, నీరు వథాగా పోతుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా తవ్విన మట్టిని రోడ్డుపైనే వదిలేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై మట్టిని తొలగించి, గోతిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

26వ రోజుకు వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కడియం

కడియం శాఖా గ్రంథాలయంలో చేపట్టిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా పేపర్ కళాత్మకతపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రముఖుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతిగా ఇచ్చారు. అనంతరం పుస్తకాలు చదివించి, సమీక్ష చేయించారు. స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీదేవి నిర్మల, రిషిత, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, కె.ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయం సిబ్బంది, పాఠకులు, రిజిస్ట్రార్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల వద్దకే నేరుగా సంక్షేమం

ప్రజాశక్తి - తాళ్లపూడి

వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తున్నారని గజ్జరం సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలో వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. సేవా రత్న అవార్డుకు ఎంపికై 20 వేల రూపాయల నగదు పురస్కారాన్ని పొందిన జి.ప్రభురాణిని ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిపి జొన్నకూటి పోసిరాజు మాట్లాడుతూ జగనన్న పాలనలో వాలంటీర్లు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు జి.చిన్నబ్బాయి, సచివాలయ కన్వీనర్లు కాకర్ల సుబ్బారావు, అనిశెట్టి సూర్యచంద్రం, వైసిపి కన్వీనర్ జి.రత్నాజీ, పంచాయతీ కార్యదర్శి హేమంతి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితునికి రూ.15వేలు అందజేత

ప్రజాశక్తి - గోపాలపురం

పలు రకాల దీర్ఘకాలిక వ్యాధుల బాధితులను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లు అందించడం అభినందనీయమని గోపాలపురం సొసైటీ ఛైర్మన్ కూసం రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గోపాలపురం పంచాయతీలో డయాల్సిస్ బాధితుడు కుడిదల సాయికిరణ్‌కు మంజూరైన రూ.10వేల పింఛను, సొసైటీ ఛైర్మన్ కూసం రామ్మోహన్‌రెడ్డి అందించిన రూ.5వేలను బాధితుని కుటుంబ సభ్యులకు అందించారు. నిరుపేదలైన వారు పలు రకాల అనారోగ్య సమస్యలు బారిన పడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పెన్షన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.చిన్న వెంకయ్యమ్మ, వాలంటీర్లు సచివాల సిబ్బంది పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

కార్టూ'నిజం'



అక్కడ నిరసనల సెగలు.. ధరల మంటల ముందు..తమరి ప్రతాపం ఏం అనడం లేదు సూర్యదేవా...!!!

గోరంట్ల విమర్శలపై ఎంపీ భరత్ ఆగ్రహం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేస్తున్న విమర్శలపై ఎంపీ మార్గాని భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భరత్ మాట్లాడారు. తాను గోరంట్లకు శిష్యుడంటున్నారు, ఇదెక్కడి సంబంధమో తనకు తెలీదన్నారు. మోరంపూడి ఫ్లయ్ ఓవర్‌తో పాటు మిగిలిన ఐదు ఎఫ్ఒబిలు శాంక్షన్ చేయించినట్టు ఎంఎల్ఏశ్రీ గోరంట్ల పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. వీటిని ఎంఎల్ఎ గోరంట్ల శాంక్షన్ చేయించినట్టు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. లేనిపోని అవాకులు చెవాకులు మాట్లాడి లోకువ కావొద్దని హితవు పలికారు. మోరంపూడి బ్రిడ్జిని డిసెంబరు నాటికి పూర్తి చేసి జాతికి అంకిత మిస్తామని ఎంపీ తెలిపారు. అన్నపూర్ణమ్మ పేటలో ఆర్ఒబి, మధురపూడి ఎయిర్ పోర్ట్‌లో రూ.400 కోట్లతో టెర్మినల్, రైల్వే స్టేషను రహదారి వెడల్పు, సెంట్రల్ డివైడింగ్ పనులన్నీ చేసి తీరతానన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల నగరానికి గర్వకారణం

ప్రభుత్వ మెడికల్ కళాశాల రాజమహేంద్రవరం నగరానికి మరో ఆణిముత్యమని ఎంపీ మార్గాని భరత్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో 16 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. ఈ ఏడాది నుంచే కళాశాల తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నర్సింగ్ బ్లాక్‌లో తరగతులు ప్రారంభమైనా, వచ్చే విద్యా సంవత్సరం సొంత క్యాంపస్‌లో తరగతులు కొనసాగుతాయని చెప్పారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్

2015లో వచ్చిన పుష్కరాలకు అభివృద్ధి పనుల నిమిత్తం మంజూరు చేసిన రూ.2 వేల కోట్లను టిడిపి నేతలు గోదావరి పాల్జేశారన్నారు. గోడలకు రంగులు తప్ప ఏమీ చేయలేదన్నారు. సిఎం జగన్ రాజమండ్రిపై ప్రత్యేక అభిమానంతో రూ.125 కోట్లు ప్రత్యేక గ్రాంటు శాంక్షన్ చేశారన్నారు. వాటితో, అభివృద్ధి పనులు శరవేగంతో పరుగులు పెడుతున్నాయన్నారు. ప్రశాంతతకు మారు పేరైన నగరంలోకి అసాంఘిక శక్తులు చొచ్చుకు రావడం దురదృష్టకరమన్నారు. కొంత మంది చదువురాని దద్దమ్మలు నాయకులుగా చెలామణీ అవుతూ బ్లేడ్ బ్యాచ్, రౌడీయిజం, గూండాయిజం చేసేవారిని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. వారి వల్లనే నగరంలో ప్రశాంతత దెబ్బతింటోందన్నారు.

నేరాలు ఘోరాలు

బాకీ తీర్చలేదని మామ హత్య

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

తను చెప్పిన బాకీ తీర్చలేదని అత్తామామలపై అల్లుడు దాడి చేయగా మామ మృతి చెందగా తీవ్రగాయాలైన అత్తను స్థానికులు వైద్య చికిత్స నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సిఐ వైవి.రమణ తెలిపిన వివరాల ప్రకారం. పసివేదల గ్రామంలో రాయించుల శ్రీరామకృష్ణారావు, దేవి దంపతులు నివశిస్తున్నారు. ఒక బాకీ జమ చేసే విషయమై రామకృష్ణారావుతో అల్లుడు నందిగం గోపి వాగ్వివాదానికి దిగాడు. చిన్న గ్యాస్ సిలిండర్‌తో దాడి చేయడంతో శ్రీరామకృష్ణారావు(62) మృతి చెందారు. దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన అత్త దేవి తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మట్టి ట్రాక్టర్ ఢీకొని యువతి మృతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మండలంలోని నడిపూడి లాకులు వద్ద శుక్రవారాం మట్టి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో అదే గ్రామానికి చెందిన యువతి మృతి చెందింది. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. నడిపూడికి చెందిన పెనుమాల శాంతి తన టెన్త్ సరిఫికెట్ల కోసం తన ఇద్దరు స్నేహితులతో కలిసి శుక్రవారం పాఠశాలకు వెళ్లింది. సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి వస్తున్న సమయంలో నడిపూడి లాకుల వద్ద వీరిని మట్టి ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శాంతి అక్కడకక్కడే మృతి చెందింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు చెబుతున్నారు. అయితే గ్రామస్తులు మృతదేహాన్ని ప్రమాద స్థలంలో ఉంచి ధర్నాకు దిగారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. ఘటనా స్థలానికి రూరల్ సిఐ ఆధ్వర్యంలో పోలీసు బృందం చేరుకుని కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

గాడిమొగ పంచాయతీ చిన వలసల గ్రామానికి చెందిన రామాడి వెంకటేశ్వర్లు (48) వేటకు వెళ్లి కాళ్లకు వల్ల చిక్కుని మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. చినవలసల గ్రామానికి పక్కనే ఉన్న చెరువులో వేటాడుతుండగా కాళ్లకు వల చిక్కుకుని మునిగిపోయి వెంకటేశ్వర్లు మరణించినట్టు తెలిపారు. వెంకటేశ్వర్లు భార్య మరణించగా, అతనికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పెన్షన్ సొమ్ములతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరారు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కొండవరం గ్రామానికి చెందిన వద్ధులకు వికలాంగులకు అందించాల్సిన పెన్షన్ డబ్బులతో వెల్ఫేర్ అసిస్టెంట్ పొన్నాడ వీరబాబు పరారైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేటికీ లబ్ధిదారులకు నగదు ఇవ్వకపోవడంతో వీరబాబుకు ఫోన్ చేసినా స్పందించ లేదు. దీంతో పెన్షన్ సొమ్ముతో పరారైనట్టు గుర్తించి కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

తాగిన మైకంలో తండ్రి పక్కలో నలిగి పసికందు మరణం

ప్రజాశక్తి - గోపాలపురం

తాగిన మైకంలో ఉన్న తండ్రి పక్కలో నలిగిపోయి ఆరు నెలల పసికందు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటయపాలెంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకటాయ పాలెంకు చెందిన వేమూలూరి గాంధీ సుబ్బలక్ష్మి దంపతులకు 6 నెలల బేబీ దివ్య ఉంది. గాంధీ కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చాడు. కల్లు తాగి వచ్చిన గాంధీ పక్కనే పాపను పడుకోబెట్టారు. తండ్రి పక్కలో నలిగిపోయిన చిన్నారి అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించిన తల్లి హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. తల్లి సుబ్బలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - యానాం

వ్యక్తి అదృశ్యంపై యానాం పోలీస్ స్టేషన్లో గురువారం కేసు నమోదయింది. తాళ్ళరేవు మండలం సుంకరపాలెం గ్రామానికి చెందిన డాక్టర్ చిక్కం వివేక్ మే 31వ తేదీన ఇంట్లో నుండి వెళ్లిపోయి తిరిగి రాలేదని తెలిపారు. దీంతో చిక్కం విక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.

ఏలేరులో గల్లంతైన వ్యక్తి మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి- జగ్గంపేట రూరల్

ఏలేరు ప్రాజెక్ట్ వద్ద స్నానానికి దిగి గల్లంతైన యువకుడుని మృతదేహాన్ని పోలీసులు శుక్రవారం గుర్తించారు. భావారం గ్రామానికి చెందిన ప్రాజెక్ట్ వద్దకు ఈత కోసం 14 మంది యువకులు వెళ్లారు. వారిలో ఒకరైన మర్రిపాక గ్రామానికి చెందిన వాసంశెట్టి మౌలేష్ (19) పమాదశాత్తు లోయలో పడి మతి చెందాడు. ఎస్ఐ విద్యాసాగర్ గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. ఈ మేరకు జగ్గంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ ప్రధాన బాధ్యత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు, వారి ఆస్తుల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యతని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయనకు ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది ఆహ్వానం పలికారు. ఎస్‌పి కార్యాలయాన్ని పరిశీలించిన ఆయన ప్రజలకు పోలీసుల నుంచి అందుతున్న సహాయ సహకారాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీస్ సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన నేర సమీక్ష విధానంలో పోలీస్ సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ప్రేమ్ కాజల్, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐజి అశోక్ కుమార్

వేసవి శిబిరాల్లో విద్యార్థులకు విజ్ఞానం

వేసవి శిబిరాల్లోని విద్యార్థులకు వినోదంతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తున్నట్లు పలువురు తెలిపారు. శుక్రవారం పలుచోట్ల వేసవి శిబిరాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం చిన్ననాటి నుంచి గురువులను, తల్లిదండ్రులను గౌరవించడం విద్యార్థులు తమ జీవనంలో భాగంగా మలుచుకోవాలని ఉపాధ్యాయని వాడపల్లి విమలా రాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆమె విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువుల గొప్పదనం గురించి వివరించారు. జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మల్లికార్జునరావు యాసలపు సూర్యారావు భవనంలో చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో ఒరిగామిపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కో-ఆర్డినేటర్ రొంగల అరుణ్, కూనిరెడ్డి అరుణ, అమత నమ్రత,మంజుల, ఐశ్వర్య, జ్యోత్స్న, సత్య, సూరజ్, కూనిరెడ్డి రవి,ఆర్ రవి, కష్ణ, వీర్రాజు పాల్గొన్నారు. **కరప** జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అరుంధతి పేట, వలసపాకలు, రామకంచిరాజు నగర్ కమ్యూనిటీ హాల్లో వేసవి వినోదం కార్యక్రమాలు నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు విద్యార్థులకు ఓరిగామి, మ్యాజిక్, పజిల్స్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్ద సుబ్బారావు, వలసపాకలు గ్రామ సర్పంచ్ రామారావు, ప్రజాసంఘాల నాయకులు రమణి, రామ్ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కాకినాడ** రోటరీ క్లబ్ ఛైర్మన్ పి.వి సుబ్బారావు జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో చిత్రలేఖన పోటీలను పరిశీలించారు. లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, పి.వీరబాబు, రిసోర్స్‌పర్సన్స్ జయరామ్, పద్మావతి పాల్గొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండల పరిధిలో అన్ని గ్రామాల్లో అధునాతన సాంకేతికతో కూడిన జగనన్న శాశ్వత భూ హక్కు రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసిల్దార్ లక్ష్మీనరస కుమారి, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. వేట్లపాలెం పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం రీ సర్వే నిర్వహణపై రైతులకు అవగాహన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండల పరిధిలో అన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయ్యి, ప్రస్తుతం రీ సర్వే ప్రారంభిస్తున్నామన్నారు. ఈ విధానంలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల్లో రైతులు 100 శాతం రీ సర్వేకు విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్ల టీం వచ్చినప్పుడు తమ రికార్డులతో హాజరై రీ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం ఉప సర్పంచి గోలి శ్రీరామ్ చౌదరి, గ్రామ కార్యదర్శి మోషే, విఆర్వోలు మామిడాల కామరాజు, కెవివి సత్యనారాయణ, లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అరుణాచలానికి బస్సు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ బస్ స్టేషన్ నుంచి అరుణాచలం స్పెషల్ బస్సును ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ బస్సును కాకినాడ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం కంచి దర్శనం అనంతరం ఆదివారం రాత్రికి కాకినాడకు చేరుకుంటుంది. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి.మనోహర్, టి.బాలకృష్ణ పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా కర్రి సత్యారెడ్డి

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మండల నూతన విస్తరణాధికారి ఇవోపిఆర్‌డిగా కర్రి హరికృష్ణ సత్యారెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ పని చేస్తున్న హిమా మహేశ్వరి పెద్దాపురం ఇన్‌చార్జి ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో సీనియర్ గ్రామ కార్యదర్శి వై.శ్రీహరి ఇన్‌చార్జి ఇవోపిఆర్డీగా వ్యవహరిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనపర్తి నుంచి సత్యారెడ్డి సామర్లకోటకు బదిలీపై వచ్చారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలితలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -కరప

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కరప ఎస్ఐ ఎస్.రామకష్ణ అన్నారు. శుక్రవారం గొడ్డటిపాలెం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు తండ్రి వెంకట్రావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎస్ఐ ప్రారంభించారు. వారధి కార్యక్రమంలో భాగంగా కరప మండలం, గొడ్డటిపాలెంలో ఉపాధి హామీ పథకం కూలీలకు అవగాహన కల్పించారు. చిన్న చిన్న సమస్యలు వస్తే గ్రామ స్థాయి సర్పంచ్ సమక్షంలో పరిష్కరించు కోవాలని ఎస్ఐ సూచించారు. ఉపాధి కూలీలు ఎండల తీవ్రత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎం చంద్రకళ వడగాల్పుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై కూలీలకు అవగాహన కల్పించారు.

దోమల వ్యాప్తి నివారణకు డ్రైడే

ప్రజాశక్తి- కరప

దోమల వ్యాప్తి నివారణకు ఫ్రైడే- డ్రైడే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు వైద్యాధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మండల గ్రామాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు, ఆయా గ్రామాలలో ఇంటింటికి తిరుగుతూ మురుకునీటి కుంటలలో ఏబేట్ మందు పిచికారి చేసారు, కొబ్బరి బొండాలు టైర్లు వంటి వ్యర్థ పదార్థాలను ఆవాసాల మధ్య ఉంచకుండా దూరంగా డంపింగ్ యార్డ్‌కు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి -కరప

మండలంలోని ఉప్పలంకకు చెందిన ఒక కాకినాడ ఆసుపత్రిలో ఉండడంతో అక్కడికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందించినట్టు సర్పంచ్ బి.నయోమి సతీష్ తెలిపారు. పట్టా నారాయణ స్వామి వారం రోజుల నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ అపర్ణ ఆసుపత్రికి చేరుకుని ఆయనకు పింఛను అందించారు.

పాత వస్తువులను అందజేయాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పనికిరాని పాత వస్తువులను రీ సైక్లింగ్ కోసం బోట్ క్లబ్ పార్కులో నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద అందజేయాలని వాకర్స్ సంఘ అధ్యక్షులు అడబాల రత్నప్రసాద్ కోరారు. బోట్ క్లబ్ పార్కులో నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న స్టాల్‌లో పాత వస్తువులను అందించి సర్టిఫికెట్ అందుకున్న అడబాల మాట్లాడుతూ ఇళ్లలో ఉండే పనికిరాని వస్తువులు వలన చెద లేదా తుప్పు పట్టడం జరుగుతుందన్నారు. పాత పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, పాదరక్షలు, బూట్లు, బొమ్మలు, ప్లాస్టిక్ తదితర సామాగ్రిని స్టాల్‌లో అందజేయాలన్నారు.

యానాం వార్తలు

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - యానాం



మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక దరియాలతిప్పలో కె.ఆర్ నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్లో ఒఎన్‌జిసి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం నియోజకవర్గంలో కంటి సంబంధిత వ్యాధులకు పూర్తిస్థాయిలో ప్రజలకు ఉచితంగా చికిత్సతో పాటు క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయించాలనే ఉద్దేశంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశామన్నారు. శిబిరంలో సుమారు 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 20 మందికి కంటి ఆపరేషన్ అవసరముందని వైద్యులు నిర్ధారించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం పరమహంస యోగానంద నేత్రాలయానికి పంపించారు. అనంతరం 150 మందికి పైగా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ నెల 4న కనకాల పేటలో నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, ప్రభుత్వ ఆసుపత్రి ఎడి పలాస్ కుమార్ సెంధ్యాల్, విద్యుత్ శాఖ ఎఇ లంక కష్ణారావు, సిఐ షణ్ముగం, లయన్స్ క్లబ్ యానాం పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, గిడ్ల వెంకన్న, కమిడి బాలయోగి, దాసరి బుజ్జి, సబ్బతి శ్రీనివాసరావు, గిడ్ల బాలయోగి, పండు సిద్ధార్థ కుమార్, కొల్లు మాధవస్వామి, నూకాంబరం, సబ్బతి లోకేశ్వరరావు, అలెక్స్, కామిరెడ్డి వీరబాబు పాల్గొన్నారు.

డెంగీ ప్రభావిత ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

డెంగీ జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఆర్ఎఒ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. మెట్టకూరు ఫిషర్మెన్ పేట, వంశీకష్ణ కాలనీ, రమాబాయి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం ఎలా ఉందో పరిశీలించారు. జ్వర పీడితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మున్సిపాలిటీ పరంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుధ్య కార్యక్రమాల గురించి చర్చించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎడి పలాస్ కుమార్ సేంధ్యాల్, మున్సిపల్ మేనేజర్ ఖండవల్లి రామకష్ణ, విద్యుత్ శాఖ ఎఇ లంక కృష్ణారావు, చెల్లి గోపీనాథ్ పాల్గొన్నారు.

ఉచితంగా 10 వేల హెల్మెట్లు పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యువతీ యువకులు వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ప్రమాదాల తీవ్రత ఎక్కువవుతుందని ఎస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్ అన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేట, భీమ్ నగర్, మెట్టకూరు తదితర గ్రామాల్లో మాజీ మంత్రి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణా రావు సమకూర్చిన హెల్మెట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైకులు నడిపేటప్పుడు ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. మల్లాడి కృష్ణారావు పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సుమారు 10 వేల హెల్మెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గూటం శివగణేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, కోన కొండబాబు, శేరు కృష్ణ పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి

ప్రజాశక్తి-అమలాపురం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వొమ్మోలు అయ్యప్ప నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మిషన్ లైఫ్, మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ్ షెహర్‌లో భాగంగా శుక్రవారం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, పట్టణ యువతచే నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, యువతతో పర్యావరణ హిత జీవన శైలి కి కట్టుబడి ఉంటానని శానిటేషన్ ఇన్విరాన్‌మెంట్ సెక్రెటరీ బండి వీరన్న ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శక్తి వనరులను, నీటిని పొదుపు చేయాలని అన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో శానిటేషన్, ఇన్విరాన్మెంట్ సెక్రెటరీస్ కె.ఈశ్వరరావు, చింతా నాగేంద్ర ప్రసాద్, వి.సతీష్, పి.భారతిదేవి, ఎం.భార్గవి, వైఎస్.భారతి, ఎం.లావణ్య, ప్రజా ప్రతినిధులు పడాల నానాజీ, పిండి రాజా తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని మహిళకు గాయాలు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మెయిన్ రోడ్డు వాణి మహల్ సెంటర్ ఐసిఐసిఐ బ్యాంకు వద్ద మోటర్ సైకిల్ ఢీకొని మహిళ శుక్రవారం ఉదయం గాయాలపాలైంది. పట్టణానికి చెందిన గనిరెడ్డి అనంతలక్ష్మి రోడ్డు చెంతనే నడుచుకుంటూ వెళుతుండగా వెనుక వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఆమె కింద పడిపోగా తలకు గాయమైంది. ఆమెను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు టౌన్ ఎస్ఐ కోన అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను మోసగించిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో నిందితునికి అమలాపురం జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు అమలాపురం తాలూకా ఎస్ఐ పరదేశి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం.. అమలాపురం రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన యలగన గణేష్ అదే గ్రామానికి చెందిన ఒక మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని తీసుకెళ్లాడు. ఆ తర్వాత బాలికను మోసం చేయడంతో అమలాపురం డిఎస్‌పి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ రిపోర్ట్ తో కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితునికి రిమాండ్ విధించారు.

4న మెగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం గ్రామానికి చెందిన నెహ్రూ అవార్డు గ్రహీత రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ వేగేశ్న తమ్మి రాజు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక మెగా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయనశుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు ఈనెల 4న సాయంత్రం గ్రామంలో వివి.కష్ణంరాజు గెస్ట్ హౌస్ వద్ద సమావేశం డాక్టర్ కష్ణంరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు మహాత్మా గాంధీ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తమ సలహాలను అందించాలన్నారు.

లాకుల బంగ్లాలో అసాంఘిక కార్యకలాపాలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం



లాకుల బంగ్లా

పర్యాటకులతో సందడిగా ఉండే లొల్ల లాకుల బంగ్లా అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. బంగ్లా చెంతని ప్రభుత్వ మద్యం దుకాణం ఉండడంతో మందు బాబులు మద్యం తాగిన మత్తులో ఈ బంగ్లా వద్ద ఇష్టాను సారంగా ఉంటున్నారు కొంతమంది యువత గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవించి ఇక్కడికి వచ్చి పర్యాటకుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల కాలంలో పోలీసులు ఈ బంగ్లాలో 20 కేజీల గంజాయితోపాటు ముగ్గురు యువకులను అదుపులో తీసుకున్నారు ఈ విషయంపై పలుమార్లు జల వనరుల శాఖ అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు కలగజేసుకుని ఇక్కడ ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలుచేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంకలో మెయిన్ డ్రెయిన్ పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభించగా సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వర్షాకాలానికి ముందే డ్రెయిన్‌లో పూడిక బయటికి తీసి శుభ్రం చేసే చర్యలు చేపట్టామన్నారు. అలాగే ప్రజలు కూడా ఎటువంటి ప్లాస్టిక్, చెత్త చెదారం డ్రెయిన్‌ల వేయవద్దనిసూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి చంటి, మోటూరి సురేష్ అడబాల వీర్రాజు, దొండపాటి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏరువాకలో పాల్గొనాలని కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆలమూరు

సార్వా వరిసాగులో భాగంగా మండలంలోని గుమ్మిలేరులో నిర్వహించనున్న ఏరువాక కార్యక్రమంలో పాల్గొని విత్తనాలు చల్లే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా ను ఆహ్వానించారు. రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన కలెక్టర్‌ను సర్పంచ్ రాంబాబు కలుసుకొని వరి వెన్నుల గుత్తును అందించారు. సార్వా ఏరువాకను తమ గ్రామం నుంచి ప్రారంభించాలని ఆయన కోరారు. ఏరువాక ద్వారా విత్తనాలు చల్లే కార్యక్రమం తమ గ్రామంలో ప్రారంభిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు సర్పంచ్ గుణ్ణం రాంబాబు శుక్రవారం విలేకరులకు తెలిపారు.

పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - మామిడికుదురు

విద్యార్థులు మహిళా హక్కులు, బాలికల సంరక్షణ, బాల్యవివాహాలు, తదితర అంశాలతో పాటు వ్యవసాయ రంగంపై అవగాహన కల్పించుకునే విధంగా యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని నగరం ఎస్ఐ షేక్ జానీ బాషా అన్నారు. రాజమహేంద్రవరం చైతన్య స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న అప్పనపల్లికి చెందిన పసుపులేటి గుణ స్వాతిక్ సమ్మర్ ప్రాజెక్ట్ రిపోర్టును శుక్రవారం ఎస్ఐకు సమర్పించారు. చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ఎస్ఐ విద్యార్థికి సూచించారు.

ఎన్‌టిఆర్ క్యాంటీన్లు ప్రారంభించండి

ప్రజాశక్తి - గోపాలపురం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న ముళ్లపూడి బాపిరాజు

ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే అర్హత టిడిపి నాయకులకు లేదని కొడాలి నాని, మరికొంత మంది వైసిపి నాయకులు అంటున్నారని, వారికి ఏమాత్రం సిగ్గున్నా ఎన్‌టిఆర్ పేరున ఉన్న అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని జడ్‌పి మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. శుక్రవారం గోపాలపురంలో జేష్ట బుల్లిఅబ్బులు ఆర్థిక సాయం పేదలకు, వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బాపిరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే అర్హత టిడిపి వారికి లేదనడం సరికాదన్నారు. ఎన్‌టిఆర్ పేరున టిడిపి హయాంలో అన్నా క్యాంటీర్ల ద్వారా పేదలకు రూ.5కే భోజనం అందించారన్నారు. అటువంటి వాటిని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. గుడివాడలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన బొమ్మతో ఓట్లు దండుకోవడం కాదని రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌టిఆర్ పేరున ఉన్న అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వైసిపి పేదల నోటివద్ద కూడును దూరం చేసిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో బిసిలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు కల్పించిన మహానుభావుడు ఎన్‌టిఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కొమ్ము నారాయుడు పుట్టినరోజు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని పెనికేరు టిడిపి నాయకులు, పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి, ఎమ్ఆర్‌పిఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము నారాయుడు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం నాయకులు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకమానికి అమలాపురం టిడిపి పార్లమెంట్ ఇంచార్జ్ గంటి హరీష్ మాథూర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా భారీ బైక్ ర్యాలీ పూర్తి చేసి, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసారు. ఇందులో భాగంగా గంటి హరీష్, సత్యానందరావు సమక్షంలో పలువురుని పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.